కళ్యాణ ఘడియ

గోపీకృష్ణ



చేతిలోని కవరు పక్కనపడేసి గట్టిగా వళ్లు విరుచుకున్నాడు శివాజీ.

కిటికీలోంచి చూశాడు బయటికి. శీతాకాల సాయంత్రం ఎప్పట్లా ఆహ్లాదంగా ఉంది చల్లనిగాలి వీస్తూ, సూర్యుడు సంధ్యాదేవి కౌగిలిచేరేందుకు వేగంగా పరుగులుతీస్తున్నాడు. పొట్టకూటికై విశాల ప్రపంచంలోకి పోయిన పక్షులు మంద్రంగా రెక్కలల్లార్చుతూ గూళ్లు చేరుతుంటే, పంజరం దాటిన పిట్టల్లా కేరింతలు కొడుతూ వీధిలో పిల్లలు ఆటలాడుతున్నారు. దూరంగా ఓ గోళీల తగవు. శివాజీ నవ్వుకుంటూ మరో కవరు తెరిచాడు—

"మైడియరన్నయ్యా,

నేను క్షేమంగా ఉన్నానని మళ్లీ వేరే రాయాలా? అక్కర్లేదు కదూ!

అన్నయ్యా నువు ఎంత చక్కగా రాస్తావు ఉత్తరాలు! అసలు ఉత్తరాలు రాయడం నీ దగ్గర్నుంచే నేర్చుకోవాలేమో ఎవరైనా. నీ ఉత్తరాలు చదువుతూంటే నాకు నిన్ను చూస్తున్నట్టే ఉంటుంది నిజంగా. సరే ఏమిటిది కవిత్వం రాస్తుందనుకుంటున్నావా? పోనీ రాయన్లే!

నువ్వేమీ అనుకోకపోతే ఓ చిన్న డవుటన్నయ్యా. ఇంత చక్కగా నాకే ఉత్తరాలు రాస్తావే! నువ్వు యింక ఏ 'వదిన' కైనా అయితే యింకెంత బాగా రాస్తావో. ఏయ్ నన్ను మట్టుకు తిట్టకేం సరదాకి రాశానంతే. నా పిచ్చిగానీ, అసలు పెళ్లికాని వాడికి పెళ్లాం ఏమిటి? ఏమిటన్నయ్యా, నీకంటే ఎంతో చిన్నదాన్ని నా పెళ్లికూడా అయిపోయింది.... ఇంకెప్పుడు చేసుకుంటావ్???"

"పెళ్లి....హ....హ...." అని నవ్వుకుంటూ ప్రశాంతంగా వెనక్కు వాలి కళ్లు మూసుకున్నాడు శివాజీ.

సిగరెట్ వెలిగించుకొని తాపీగా పొగ వదిలాడు.

"ఇంకో ఏడాదిలో రిటైర్ కాబో తున్నవాడికి పెళ్ళా !"

నవ్వుకు, , ప్రేమగా చెల్లెలి ఉత్త రాన్ని గుండెకదుముకున్నాడు.

పక్కనే ఉన్న కుర్చీలో ఓ ఉత్తరాల బొత్తి. చదివిన సూచనగా కొన్ని కవర్లు విడిగా పడిఉన్నాయ్. ఆ ఉత్తరాలు ఈనాటివి కావు. దాదాపు పాతిక ముప్ఫయ్యేళ్ళ క్రితానివి.... ఎన్నో జ్ఞాప కాలు, యింకెన్నో మధుర భావాలు, వింత సంఘటనలకు ప్రతీకలవి.

గత స్మృతులు మెల్లగా నిద్రలేవ సాగాయి...

* * *

"ఇంత చిన్నప్పుడే ఉద్యోగమేమి టండీ బావగారూ, చదివించండింకా వాణ్ణి" పిన్ని.

"ఓస్, బోడి బియ్యే పాసవ్వగానే ఉద్యోగా లెవరిస్తారండీ...."

"అందులో ఈ ఏడేగా పాసయింది"

"ఉద్యోగం రావాలంటే కనీసమో రెండేళ్ళయినా పడుతుందిగా అన్నయ్యా, ఎమ్మే కానివ్వరాదయ్యా" బాబాయిల హెచ్చ రికలూ, సలహాలూ.

"మాకు మాత్రం చదివించచాలని లేదంటారా, కానీ ఆయనొక్కరి సంపా దనమీద ఏడుగురం తినాలండీ. ఎందరి కని కట్టం ఫీజులు ! యూనివర్శిటీ అంటే యిప్పుడు ఫీజులు కాకుండా నెలనెలా ఓ రెండొందలైనా పంపాలా ! ఎలా సాధ్య మౌతుందండీ...." అమ్మ వివరణ.

"చూద్దాం! ఏ లాటరీ అన్నా తగలక పోతుందా ఈ లోపులో" అన్నట్టు మాట్లాడే నాన్న.

ఆ చర్చ అంతా తనగురించే అయినా తనకేమీ పట్టనట్టు దీక్షగా బొమ్మ గీయ డంలో నిమగ్నమై ఉన్న శివాజీకి చెదురు మదురుగా విన్పిస్తున్నాయి వాళ్ళ మాటలు. కొన్ని మాటలయితే చెవిలో దూరు తున్నాయిగానీ వాటి భావమేమీ బుర్ర కందటంలేదు ఏకాగ్రతతో బొమ్మ గీయడం వలన. మొదలుపెట్టినప్పుడు అనుకున్నదానికంటే కూడా ఎంతో బాగా ఈ బొమ్మను గీయగలిగాననే తృప్తి మనసంతా నిండుకుని మరింత ఉత్సా హంగా మెరుగులు దిద్దుతున్నాడు ఆ నాట్యభంగిమ కాలి అందెలకు !

"మేం లేమేమిటండీ సహాయం చెయ్యాలంటే ఎప్పుడన్నా. యిబ్బంద యితే చూసుకోవచ్చుగానీ చదివించండి వాణ్ణి. మావాళ్ళెలానూ చదివేట్టులేరు.."

తలెత్తాడు.

రాఘవ బాబాయి మాట్లాటది. తనకు తెలుసు. అందరూ ఒకరి సంపాదన మీద ఆధారపడినవాళ్ళే.... ప్రయాణీకు లెక్కువే కాని నావను లాగేదిమాత్రం ఒక్కడే అన్ని సంసారాల్లోనూ. అభి మానం వాళ్ళనలా అనిపిస్తోంది.

"ఎందుకులే బాబాయ్. డిగ్రీ అయిం దిగా ఏదో ఒక ఉద్యోగం గ్యారంటే అంటున్నారంతా."



7

"నోర్మూయ్యవోయ్ పెద్దచెప్పొచ్చావ్. ఇంతకూ నువ్వేంచేస్తున్నావక్కడ?"

"ఆఁ ఏంలేదు.... ఏదో చిన్న బొమ్మ" మధ్యగదిలో ఉన్నవాళ్లకు దూరంనుండే చూపించాడు.

"వార్నీ ఇంకా మానలేదేవిట్రా ఆ బొమ్మలూ???" ఆశ్చర్యంగా అన్నాడు రవి బాబాయ్

పిన్నలయితే పరుగెత్తుకొచ్చేశారు బొమ్మ చూడగానే 'ఎంత చక్కగా వేశావురా' అంటూ.

సంభాషణ దారిమళ్లింది. పంచదార కోటానుంచి ఫారిన్ ఎక్సేంజివరకూ సంభాషణలు సాగుతున్నయ్ వాళ్లమధ్య. ఉద్యోగాల మూలాన వేర్వేరు చోట్ల ఉండేవాళ్లు అలా రెండుమూడేళ్లకోసారి ఎక్కడైనా ప్రీప్లాన్‌గా కలిసి ఎంజాయ్ చేసేవారు.

వాళ్లు మళ్లీ సంభాషణలో పడడంతో శివాజీ మళ్లా తన దృష్టిని చిత్రంపై కేంద్రీకరించాడు.

చిన్నపటినుండే ఏదో బొమ్మలు గీస్తుండేవాడు శివాజీ. మొదట్లో ఏదైనా బొమ్మను ఆధారంగా తీసుకుని మళ్లా దాన్ని రిప్రొడ్యూస్ చేయడమో, ఎన్లార్జ చేయడమో చేసేవాడు. రానురాను స్వయంగా ఊహాచిత్రాలుగా అనుకున్న ప్రతీ భావననూ మలిచే స్థితికొచ్చాడు.

ఆర్టిస్ట్‌గా అతను చాలా 'సెన్సిటివ్'.

ప్రతి చిన్న విషయానికి కూడా స్పందించేవాడు.

వేసే ప్రతి బొమ్మా అతనికి అలౌకికమైన తృప్తి, ఆనందం పంచేవి.

శివాజీని చదువు చెడగొడుతున్నావని తల్లిదండ్రులు మందలించిన రోజులూ ఉన్నయ్.

*　　*　　*

గడియారం ఠంగున మోగడంతో వాస్తవంలోకొచ్చాడు.

అయిదున్నర.

ఉత్తరం గుండెలమీదనుండీ తీసి కళ్ళజోడు సరిచేసి చూశాడు....

"నా పెళ్ళికూడా అయిపోయింది. ఇంకా నువ్వెప్పుడు చేసుకుంటావు అన్నయ్యా?"

నవ్వుకుంటూ పేజీతిరగేసి చూశాడు. చివరగా—

"నీ ప్రియమైన చెల్లెలు
　　　　　　　రుక్మిణి."

"ప్రియమైన... అవును ప్రియమైన... అందరూ ప్రియమైనవారే నాకు." గొణుక్కున్నాడు. తల్లిదండ్రులూ, బంధువులూ, స్నేహితులూ అందరూ ప్రియమైనవారే తనకు. అందరూ ప్రేమించేవాళ్ళే. ఇంత మంది ప్రేమించేవాళ్లు, మంచిచెడ్డలు చూసి బాగుకోరేవాళ్లూ ఉన్నా మనిషి పెళ్ళిచేసుకోక తప్పదా? ఏమిటి పెళ్ళంటే? ఈ బంధం లేకుంటే మనిషికి మనుగడ లేదా? ఎందుకు లేదు? తప్పకుండా ఉంది. అందుకు ఉదహరణ తనే!

మళ్ళా ఒకసారి ఉత్తరం వంక చూశాడు....

"ఇంకా ఇప్పుడు పెళ్ళేమిటమ్మా చెల్లాయ్!" స్వగతంగా అనుకుంటూ ఉత్తరాన్ని ముద్దుపెట్టుకున్నాడు ప్రేమగా. పాత ఉత్తరాన్ని చదువుతుంటే ఆవరించిన నిస్సత్తువ జారిపోయి మళ్లా యవ్వనం ప్రవేశించినట్టయింది. ముఖాన వెలుగు.... కళ్లలో కాంతి. దీప్తివంతమైన వదనంతో పక్కనే పడున్న కవర్లోకి ఆ కాగితాన్ని మడిచి తోశాడు.

హు! ముప్ఫయేళ్లనాటి సంగతి. అప్పట్లో పెళ్లో పెళ్లో అంటూ అందరూ ఒకటే గోల. "ఇరవై ఎనిమిదొచ్చాయి యింకెప్పుడు చేసుక్కుంటావురా" అని పోద. అంతవరకూ చదువే ధ్యేయంగా ఉండేది. ఎలాగైతే 'ఎమ్మే' పూర్తి చేయడం; అదృష్టంకొద్దీ ఓ మంచి కాలేజీలో ఏడాదికే ఎకనమిక్స్ లెక్చరర్‌గా ఎపాయింట్‌మెంట్ దొరకడంతో ఇరవై అయిదేళ్లకే సంపాదన మొదలైంది. అప్పట్నుంచీ వయసు గుర్తుచేస్తూ 'పెళ్లి.... పెళ్లి' అంటూ వెంటపడ్డారందరూ.

మొదట్లో ఏదో తెలియని ఉత్సాహం. పెళ్లిచూపుల కెళ్లేవాడు.

ఏ అందమైన అమ్మాయిని చూసినా ఓ సుందర చిత్రం మనోనేత్రం ముందు కదిలేది—

ఏదో తపన.... ఆరాధన.... ప్రతీ పడతీ అందానికే ప్రతిరూపంగా—

శివాజీ భావన లిలా ఉంటే....

అతని కెంతేనా నచ్చిన అందాల రాశులను కట్నకానుకల పేచీతో వదులుకున్నారు తల్లిదండ్రులు.

అతనిలోని ఆర్టిస్ట్ చాలా సెన్సిటివ్‌గా ఫీలయాడు... మానసికంగా దెబ్బతిన్నట్టయ్యాడు....ఈ విషయంలో తిరస్కరించిన అమ్మాయిల్ని ఊహించలేకపోయేవాడు. ఎంతో బాధపడేవాడు.

"సృష్టిలోని అందానికి ప్రతిరూపం ఆడపిల్ల."

"సృష్టిలోని ప్రతి అణువణువూ రమణీయమైనదే....అలాటి ఎన్నో అణువుల పొందిక, ఓ అంగాల ఆణిముత్యాల మాలికే రమణీమణి...."

—అనుకునేవాడు. అటువంటి 'అందానికి' ఈ హింస; అవమానం ఏమిటి? మధనపడ్డాడు.... క్రమేణా శివాజీ దృష్టిలో 'పెళ్ళి' అన్నది తేలిపోయింది.... అతనిలోని సంఘర్షణకు ఫలిత మిది!

"అప్పుడే నాకు పెళ్ళొద్దు" అని అన్నాడు ఓ రోజు—

తరువాత ఎవరెన్నిసార్లడిగినా అదే సమాధానం చిరునవ్వుతో.

శివాజీలో ఓ మార్పు ప్రత్యక్షంగా కన్పించింది ఆ తర్వాత....

మిగతా చిత్రాలెలా ఉన్నా ముఖ్యంగా అందమైన అమ్మాయిలను చిత్రించడానికే ఉత్సాహం చూపసాగాడు. రకరకాల కావ్యకన్యకలు కదలి రాసాగారతని చేతి కదలికల్లో. అనూహ్యమైన అందగత్తెలు జీవంపోసుకున్నారు 'కాన్వాసు' మీద శివాజీ కోర్కెమీద. అయితే ఆ చిత్రణ ఏ 'వికారం' వల్లనూ కాదు. వేసే ప్రతి చిత్తరువూ అతనికో తృప్తి, ఆహ్లాదం ఈయగా ప్రతి గీతా పవిత్రభావంతో, పెదవులపై చిరునవ్వు చెదరకుండా గీసేవాడు. వలువలలో ఒదిగిన వనితనే చిత్రించాడు తప్ప వస్త్రాలు విడిచి వయ్యారాలొలకబోసే వగలాడి శివాజీ కుంచెనుండి ఏనాడూ వెలువడలేదు. అలా ఖాళీ సమయాలన్నీ మరో ధ్యాస లేకుండా గడపసాగాడు ఉత్సాహంగా!

వెన్నాడుతున్న జ్ఞాపకాలనుండి తేరుకుని కవర్లన్నీ జాగ్రత్తగా మడచి వరుసగా సర్ది కట్టగట్టి లేచి అల్మయిరాలో సర్దాడు. తిరిగివచ్చి పడక్కుర్చీలో కూర్చుని సిగరెట్ వెలిగించి ఆలోచించసాగాడు.

"తనకు జీవితంలో ఏదైనా లోటుందా?"

"లేదు" అనుకున్నాడు తృప్తిగా.

పాతికేళ్ల క్రితం తమ్ముళ్ల ప్రశ్న చెవుల్లో గింగురుమంది.

"ఒరే అన్నయ్యా మా పిల్లల్ని చూస్తున్నావా ఆ సందడి కోసమైనా పెళ్లిచేసుకోవేంరా?"

శివాజీ నవ్వేడు.

"ఏరా, వాళ్లు నా పిల్లలు కారా? పెదనాన్నా అనే పిలుపులో మాత్రం మాధుర్యం లేదా?"

"నాన్న-అన్నదిమధురమైనదని ఒప్పు కుంటూనే ఎందుకురా యిలా జారు కుంటావ్! పోనీ ఎవర్నయినా ప్రేమించి మోసపోయావా?"

ఒకర్నేముంది, తను అందర్నీ ప్రేమించాడు. కానీ ఈ ప్రేమ వేరు, తమ్ముడడిగేది. అందుకే తల అడ్డంగా ఊపాడు-ఎదురుగా కూర్చున్న తమ్ముడు కులపతి కళ్లలోకి చూస్తూ అన్నాడు.

"ప్రేమించే మనసు నాకు లేదురా. ఇంక మోసపోయే దేముంది?"

"ఎందుకురా మమ్మల్నిలా బాధ పెడ్తావ్? నువ్వు చేసుకోకుండానే మమ్మల్ని చేసుకోమని పట్టుబట్టావ్. పంతం నెగ్గించుకున్నావ్. ఇప్పుడైతే ఏం పోయింది చేసుకోరాదూ_"

"మీ రెందుకురా బాధపడడం! నేనా ఉద్యోగమేదో చేసుకుంటూ హాయిగానే ఉన్నా కదా!" నవ్వుతూ తేల్చేశాడు శివాజీ.

"నీలో....నీలో...ఏ....లో....ప.... మైనా..." అడగలేక అడగలేక అడి గాడు, కులపతి.

ఉలిక్కిపడ్డాడు శివాజీ పడక్కుర్చీలో. అప్పటి తమ్ముడి ప్రశ్న ఇప్పుడూ ఉలిక్కి పాటు కలిగించింది. తనకు ఏదైనా లోపమా?

"నో!"

తనకూ యౌవన తొలిదశలో అన్ని కోరికలూ ఉండేవి. మధుర భావాలూ కలిగేవి. కానీ తనలోని కళాకారునికి పెళ్లికీ ఎందుకో పొసగలేదు. అతనిని కళాతృష్ణ గెలుచుకుంది.

చిత్రలేఖనమే ప్రాణం!

బొమ్మ గీయడమంటే తీయని అను భూతి!!

బలంగా నాటుకున్న దొక్కే కోరిక;

ఆడపిల్లను అమృతవాహినిగా, ప్రకృతి కాంత రూపారవిందంగా అందానికే మారుపేరుగా చిత్రించాలి! ప్రపంచానికే అందమంటే ఏమిటో తెల్పాలి!!

సృజనాత్మక శక్తిగలవాడతను. అందుకే రాణించాడు_చిరకాలంలోనే.

ఈనాడు శివాజీ ఓ పెద్ద ఆర్టిస్టు. ఎన్నో ప్రదర్శన లిచ్చాడు తన కిష్టం లేకున్నా మిత్రుల ప్రోద్బలం వల్ల. తానుగా ఎన్నో బహుమతు లందు కున్నాడు. శివాజీ బొమ్మలకు ప్రత్యేక ఫేం, ప్రజల్లో ఒక విశిష్ట స్థానం అతని కుంచెకు. అతడు చిత్రించిన కావ్యకన్య లకు ప్రజలు జోహార్లర్పించారు. అయి నప్పటికీ కదలివంటిది అతని తృష్ణ.... ఇంకా తీరలేదతని దాహం.

సిగరెట్ ఆఖరు దమ్ము పీల్చి బట్

కిటికీలోంచి బయటకు విసిరాడు, ఆలోచిస్తూనే.

"మాస్టారూ" పిలుపు వినబడ్డంతో ఉలిక్కిపడ్డాడు. ఆలోచనలకు సడన్ బ్రేక్ పడింది.

"యస్ కమిన్ !"

"నమస్తే మాస్టారూ...."

"ఓ ప్రభాకర్, నువ్వా. ఇలా వచ్చావేమిటోయ్ ?"

"లా ఆఫ్ ప్రపోర్షనల్ రిటన్స్ క్లాసులో అర్థంకాలేదండీ... మీరు...."

"ష్యూర్. కాస్త ఆ లైట్ ఆన్ చెయ్యి.... చీకటిపడింది బాగా."

"అదేనండీ. లైట్ లేదు; మీరు వున్నారోలేదో తెలియక బయటేనుంచుండిపోయాను" అంటూ స్విచ్ నొక్కి ట్యూబ్ వెలగగానే అరచేతిని ముద్దుపెట్టుకున్నాడు ప్రభాకర్.

నవ్వుకున్నాడు శివాజీ.

"కమాన్ కూర్చో" కుర్చీ చూపించాడు.

శివాజీ క్లాసులో ఎంత స్ట్రిక్ట్‌గా ఉంటాడో బయట అంత సరదాగానూ ఉంటాడు విద్యార్థులతో. అనర్గళమైన ఇంగ్లీషులో ఎలా చెబుతాడో అంత అందంగానూ తెలుగులోనూ చెబుతాడు. మిగతా పిరియడ్స్‌కి రాని విద్యార్థులు కూడా శివాజీ ఎకనమిక్స్ పాఠానికి వచ్చిన సందర్భాలున్నాయి. విద్యార్థులకు శివాజీ అంటే గౌరవం, ప్రాణం. అందుకు కారణం అతని ప్రవర్తనే. ఎవరూ వేలెత్తి చూపలేనంత ఉన్నతుడు లెక్చరర్‌గా.

"థాంక్యూ సర్ !"

పాఠం విన్న ప్రభాకర్ నమ్రతతో

అన్నాడు. అతని ముఖం సంతోషంతో విండి ఉంది.

"ఎనీ మోర్ డౌట్స్ ?"

"నో, సర్ !"

రెండు నిముషాలలా నిశ్చలంగా కూర్చున్నారు_

ఎందుకో శివాజీకి సరళ గుర్తుకొచ్చింది. సరళ చాలా తెలివైన పిల్ల. శివాజీ శిష్యురాలు నాలుగేళ్ల క్రితం.

"అ కెక్కా లా ఉంది ప్రభాకర్ ?" ప్రశ్నించాడు.

అంతవరకు నవ్వుతూ ఉన్న ప్రభాకర్ ముఖం వివర్ణమయింది.

నెమ్మదిగా అన్నాడు_ "బాగానే ఉంది మాష్టారూ."

మౌనంగా మరి రెండు క్షణాలు దొర్లాయిద్దరి మధ్య.

"వెళ్లొస్తాను మాష్టారూ" ప్రభాకర్ లేచాడు.

"ఒకే, గుడ్ నైట్"

"గుడ్ నైట్, సర్ !" నీరసంగా వెళ్లిపోయాడు ప్రభాకర్.

శివాజీ ఆలోచనలు సరళ చుట్టూ తిరగసాగాయి.

సరళను తను ప్రేమించాడు !!!

ఎలా ???

అందరిలా 'వ్యక్తి' ని కాదు_

ఆమెలోని అందాన్ని ప్రేమించాడు ఓ చిత్రకారునిగా !

ఆమెలోని విద్యార్థినిని ప్రేమించాడు గురువుగా !

ప్రకృతిలోని అందం మూర్తీభవించిన కన్య సరళ !

తాను గీసిన ఎన్నో బొమ్మల కాధారం సరళ !

తనకు తెలుసు తనలో భావ ప్రేరణకు సరళే ఆ మధ్య కాలంలో కారకురాలు. తనకు ఎన్నో ఊహాలు కలిగించి అనేక చిత్రాలు చిత్రించడానికి కారణం ఆమేనని ఆమెకు తెలియదు.... కానీ తనకది తెలుసు. ఆమెకు పెళ్లి నిశ్చయమైందని తెలిసినపుడు ఎంతో ఆనందించాడు; ఏదో తృప్తి ఫీలయాడు.

పెళ్లికి రమ్మని శుభలేఖ యిచ్చిన సరళను మనస్ఫూర్తిగా ఆశీర్వదించాడు కూడా....

కానీ....

పెళ్లయిన నెల్లాళ్లకే మనసుపడి ఆమె చేసుకున్న బావను ఆమె కళ్లముందే దారుణంగా లారీ తొక్కిపోయిందని తెలుసుకున్న తనకు నోట మాటరాలేదు. నిశ్చేష్టుడయ్యాడు.

ఏం చెయ్యగలరెవరైనా ?

పరామర్శించడానికి వెళ్లాడు_పెళ్లికి వెళ్లకపోయినా....

అతని కేమీ అర్థంకాలేదు_

అంతా ఆశ్చర్యంగా ఉంది....తనను ఎన్నో చిత్రాలు గీయడానికి ప్రేరణ

విచ్చిన ముగ్ధ ఏమైనా? ఎక్కడికి పోయిందా సౌందర్యమంతా?

ఏమిటి జుత్తు విరబోసుకుని తెల్లని చీరలో నుదుట బొట్టులేక, చేతులు నిర్జీవంగా గలగలలు విన్పించే గాజులే లేక అసలు శోకానికే ప్రతిబింబంలా....

"సరళా" పూడుకుపోతున్న గొంతు పెగల్చాడు శివాజీ.

వాడిన పూవులా తలెత్తింది—చూడలేకపోయాడు.

"పిలిచినప్పుడు మనోహరంగా నవ్వే ఆ కళ్ళేవి?"

కన్నీటి కడలిలా ఉన్నాయి ఆ విశాల నేత్రాలిపుడు.

"అయామ్ సో సారీ...."

వికృతంగా నవ్వింది.

తనింక అక్కడ ఉండలేకపోయాడు. తిరిగొచ్చాక ఓ వారం రోజులు నిద్రాహారాలు లేవు. ఒకటే టార్చర్? ఎలాగో తెలిసింది, 'ముండనం' తలపెట్టేలా ఉన్నారని. ఇక ఊరుకోలేక పోయాడు. తనే వెళ్ళి సరళ తల్లిదండ్రులతో తీవ్రంగా వాదించాడు. ఎన్నడూ ఇలా బయటపడని వ్యక్తి అంత గట్టిగా పట్టుబట్టేసరికి మిగతా లెక్చరర్లు కూడా శివాజీకి వత్తాసుపలికారు. శివాజీ నెగ్గాడు. 'ముండనం' ఆగిపోయింది గాని మిగతా తంతు నాపలేకపోయారెవరూ. అదే చాలుననుకుని తృప్తిపడ్డారందరూ.... శివాజీని మెచ్చుకున్నారు. కానీ శివాజీ బాధ మరింతగా పెరిగింది. అందానికే విధించిన శిక్ష యిది? ప్రకృతిసిద్ధ సౌందర్యానికి ఇంత దారుణమైన శిక్ష. అసలెలా విధించగలిగారు??? అందాన్ని చిత్రహింసలు పెట్టేందుకుపెళ్ళి వరంతా? "ఛ; అసలీ సమాజానికి బుద్ధిలేదు," తీవ్రంగా అనుకున్నాడు.

"రుక్మిణీ నా బుర్రంతా పాడుచేశావు కదే ఇవాళ.... అసలా పాత ఉత్తరాలు చదవకుండా ఉండాల్సింది," అనుకుంటూ స్నానానికి లేచాడు వళ్ళు విరుచుకుంటూ. కణతలు బలంగా నొక్కుకున్నాడు, బాధగా. ట్యూబ్ లైటు ఒక్కసారి ఆరి మళ్ళీ 'టప్‌టప్' మని వెలిగింది వెంటనే.

హీటర్‌తో నీళ్ళు కాసుకుని షాంపూ బాత్ కానిచ్చాడు. ఇంటికి తాళం వేసి భోజనానికి మెస్‌కి బయలుదేరాడు.

వండిపెట్టేవాళ్ళు లేరనే బాధ ఏనాడూ కలగలేదు. మెస్‌లకు బాగా అలవాటుపడిపోయాడు జీవితంలో. భోజనం కానిచ్చి యిల్లు చేరుకున్నాడు. దారిలో కొన్న కాన్వాస్ ఈజిల్‌కు తగిలించి చిత్రించసాగాడు. పేలట్ ఎడమచేతిలో పెట్టుకుని కుడిచేత కుంచెను కాన్వాసుపై నర్తింప సాగాడు. చకచకా సవవ సాగింది .. కాన్వాసు రంగులతో నిండి తడి ఆరక మెరుస్తుంది.... అక్కడక్కడ మెరుగులు దిద్దాడు.... బొమ్మ

పూర్తయింది. పాలెట్‌లు, బ్రష్‌లు టేబిల్‌పై పడేసి నించున్నాడు శివాజీ.

పచ్చని గడపమీద కూర్చుని బారెడు జుట్టును చిక్కుతీసుకుంటున్న అతివ కాన్వాసు మీద ప్రత్యక్షమయింది.

ముఖాన మెరిసే కాంతివంతమైన ఎర్రని కుంకుమ తిలకం.... పాయలుగా జారిన జుట్టునుంచి అలవోకగా కన్పిస్తున్న చెవిపోగు....ముక్కున పగడపు పుడక ... ప్రేమ తొణికిసలాడే అర మోడ్చిన కళ్లు.... చిక్కని గాజులు నిండిన పొడవైన చేతులు.... తీర్చిదిద్దినట్టున్న అవయవ సౌందర్యంతో ఉన్న ఆ పడతిని తదేకంగా చూశాడు. తృప్తిగా నవ్వుకున్నాడు. కుంచె అందుకుని అందంగా వ్రాశాడు బొమ్మ క్రిందుగా "అమ్మ" అని.

ప్రేమగా చూసుకున్నాడు. నిండిన హృదయంతో పడకగదిలోకివెళ్లి లైట్ వేసి అలానే మంచంమీద వాలిపోయాడు....

గోడలనిండా అతనిచిత్రాలే.రకరకాల భంగిమల్లో పెయింటింగ్‌లు కనులపండువగా. ఆపేక్షగా చూసుకున్నాడుచుట్టూ.... అన్నీ అమ్మాయిల చిత్రాలే.. చెమ్మచెక్క లాడుతూ, గొబ్బెమ్మల చుట్టూ తిరుగుతూ, వెన్నెల్లో తానాలాడుతూ ఊయలలూగుతూ సంధ్యవెలుగులలో నీటి కడవలు మోస్తూ, ప్రియుసమాగమానికాయత్త చిత్తయై తనవాకిట ఎదురుతెన్నులుకాస్తూ ....ఇలాఎన్నో హాయిగా అనుకున్నాడు.

...."ఈ బొమ్మలు తన ప్రాణం. తనకు నచ్చిన రీతినే గీసుకున్నాడుతప్ప ఒకరికి లొంగిపోలేదెప్పుడూ. అవును ఇది తను సృష్టించుకున్న లోకం. ఈ చిన్న ప్రపంచంలో కళారాధనకే స్థానం. కళ అనంతం. అల్పమైన జీవితకాలంలో అనల్పమైన చిత్రీకరణలోని ఓ చిరుదివ్వెగా వెలిగితే చాలు...."

ఎదురుగా కన్పించే నిలువెత్తు చిత్రం వైపు తల తిప్పాడు.

గుండ్రని ముఖం; దీపశిఖవంటి చిరుతిలకంతో ఫాలం, అందంగా జారిన పాపిటబొట్టు,ఆకర్ణాంతమైన కనుబొమలు, తళతళమని చంచలంగా తిరిగే చేపల్లా అనిపించే పెద్ద గుండ్రని కళ్ళు, సంపంగిని తలపించే నాసిక, కెంపులు పొదిగిన అధరాలతో చిన్నగా వంపుతిరిగిన చుబుకం, నిబిడోన్నత వక్షస్థలిపై డోలలాడుతున్న హారం, లేదనిపించే సన్నని నడుము, మొగలిరేకులు మనోజ్ఞంగా అలరించిన పిరుదులు దాకే నీల వేణి, చివరగా జడకుప్పెలు, పాదాలవరకు అందంగా జాలువారిన కుచ్చెళ్లు, అలదిన పసుపు-పారాణి పాదాలకే వన్నె తేగా, ఎర్రని గాజులతోనిండిన తామరతూండ్ల వంటి చేతులలో దీపశిఖను నుంచుకుని నీలిరంగు చీరెలో నిండుగా, పయ్యారంగా స్వాగతిస్తున్న ప్రౌఢ జీవకళ ఉట్టిపడుతున్నట్టుగా ఉంది....

ఈ చిత్రం తెనుగింటి ఆడపడుచుకు ప్రతీకగా తన సృష్టి; తాను చిత్రించిన ఓ 'మాస్టర్ పీస్'.

ఈ చిత్రానికి ప్రేరేపణ సరళ।

శివాజీ హృదయం బాధగా మూల్గింది.

అవును సరళను దృష్టిలో ఉంచుకునే తాను చిత్రించాడు.

ఆంధ్రుల ఆడపడుచుగా అందానికి మారుపేరుగా తన చిత్రంలో ఇప్పటికీ, ఎప్పటికీ- ఉంటుంది.

నిజానికామె జీవితం యిప్పుడు ఎండి వాడిన మోడు.

ప్రకృతి అందానికి విధించిన దారుణ శిక్ష యిది।

తానిది భరించలేకు. భర్తపోయినంత మాత్రాన ప్రకృతి ప్రసాదాన్ని తుడిచి వేయడానికి వాళ్ళెవరు? శివాజీకి కళ్ళనీళ్ళ తిరిగాయి గిర్రున.

బాధగా జుట్టు పీక్కున్నాడు...

ఏదో తెలియని కోపం, ఎవరిమీదో కూడా తెలియదు।

ఏమిటీ సంఘం విధించే ఆంక్షలు??

మారుతున్న కాలంతోపాటు మారని ఈ న్యాయాలేమిటి?

ఎంతవరకూ అవి అవసరమో ఆలోచించనక్కరలేదా?

అందరూ బాధపడుతూనే ఎందుకు ఆంక్షలను, కట్టుబాట్లను అమలు జర-డం?

.. కఠినత్వపు సంకెలలను ఛేదించే మార్గమే లేదా?

ఏది ఏమైనా అందమైన జీవితాన్ని, ఓ అందాలరాశి సౌందర్యాన్ని కాల

రాయడం సహించలేకపోతున్నాడు. బూజు పట్టిన ఆచారాల్ని మాన్పించగలస్థాయిలో లేడు తాను. చెప్పినా వినరు.

అతనికంటే అతనిలోని చిత్రకారుని సున్నిత హృదయం పడే బాధ ఎక్కువగా ఉంది.

పెళ్ళికాకున్నా తాను ఏ బాధాలేకుండా సుఖంగానే ఉన్నాడు. కానీ కోరి పెళ్ళి చేసుకున్న ఆమెకీ కష్టాలేమిటి? తాను ఎంతగానో అభిమానించి, జీవితంలో స్వర్గసౌఖ్యాలతో సుఖపడాలని మనసారా కోరుకున్న వ్యక్తి జీవితం ఇలా అర్ధాంతరంగా నాశనం కావడమేమిటి? ఇక ఆ అమ్మాయి జీవితాంతం తాను చేయని తప్పుకు కుళ్ళికుళ్ళి ఏడుస్తూ, చీకటి గదుల్లోనే మగ్గిపోతూ నిర్వచించలేని సంఘాన్ని లోలోన కసిగా తిట్టుకుంటూ తనను తానే నిందించుకుంటూ గడపవలసిందేనా?

కాకూడదు. అలా కాకూడదింకా. ఆ సౌందర్యరాశి జీవితంలో తిరిగి వెలుగులు నింపాలి.... సంతోషాన్ని తేవాలి. ఎలా? ఎలా? ఆమె నిత్యాలంకృతయై తనవంటి కళాపిపాసకులకు ప్రాణం పోస్తుండాలంటే ఎలా? ఎలా సాధ్యమది?

అతని మనసారోజెందుకో తీవ్రంగా ఆలోచించసాగింది. చుట్టూ ప్రపంచాన్నే మర్చిపోయి ఆలోచించసాగాడు. ఉన్నట్టుండి శివాజీ కనుబొమ ముడివడింది. విస్ఫారిత నేత్రాలను కళ్ళకెదురుగా కనబడుతున్న ఆ మనోహరి నిలువెత్తు చిత్రంవైపు తిప్పాడు. తృప్తినిండిన చిరునవ్వు పెదాలపై వెలసింది పరిష్కార సూచకంగా.

తనదే ఈ సుందరి యికనుండీ.... దీపతోరణాలతో స్వాగతంపలికేది తనకే కాబోలు యినాళ్ళనుండి.... ఆహ్వానాన్ని మన్నించాలి.... మన్నిస్తాడు కూడా. తానామెనుండి ఏమీ ఆశించడు.... తన కోరిక ఒక్కటే– తన చిత్రంలోని కన్యలా నిత్యం మంగళకరంగా ఆమె ఉండాలి. అవును.... తన కోరిక అదొక్కటే. ఆహ్వానిస్తూ చేతులు చాచాడు పడకపైనుంచే శివాజీ–

చిత్రంలోని ప్రమద వయ్యారంగా, కాలిమువ్వలు సరిగమలు మ్రోయగా, హంసలా నడుస్తూ, కుచ్చెళ్ళు అలల్లా కదులుతుండగా తనవద్ద కొస్తున్నట్టు కన్పించింది శివాజీకి. తన వడలిన పెదాలకు కెమ్మోవి నాన్చి ముద్దాడింది. చేతులు బిగియారా చుట్టి కనులు మూసుకున్నాడు. నిట్టూర్పుగా ఊపిరి పీల్చాడు గుండెల నిండుగా. నిద్రలోకి జారిపోయాడు.... పెదవులమీద చిరునవ్వు మాత్రం చెదరలేదు రాత్రంతా.

* * *

మర్నాడు....

ఉషాత్పూర్వమే లేచి హుషారుగా తయారుకాసాగాడు శివాజీ....

కాన్వేపటికీ మంచుతెరలు చించుకుని ధవళకాంతులు వెదజిమ్ముతూ పైకొచ్చాడు సూర్యుడు.